ఆంధ్రజ్యోతి


andhrajyothy.com

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6। కనిష్ఠం 20.8

5


కామారెడ్డి
జిల్లా వార్తలు

ఆదివారం 17 మార్చి 2024



ఈదురుగాలులతో కూడిన వర్షం

కామారెడ్డి టౌన్, మార్చి 16: కామారెడ్డి నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. శనివారం సాయంత్రం నుంచి చల్లటి వాతావరణం ఏర్పడి నియోజకవర్గంలోని రామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బిక్కనూర్ తదితర మండలాల పరిధిలో వడగండ్ల వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల రైతులు వేసిన వరి పంటలోని ధాన్యం నేలరాలింది. రామారెడ్డి, మాచారెడ్డి తదితర మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. చేతికొస్తున్న పంట వడగండ్ల వానలతో నేలకొరుగుతుందని ఆవేదన చెందుతున్నారు. జిల్లా కేంద్రంలో గంట పాటు వడగండ్ల వాన కురిసింది.



సార్వత్రిక ఎన్నికలకు మోగిన నగారా

- ఏడు విడతల్లో పార్లమెంట్ ఎన్నికలు
- నాలుగో విడతలో తెలంగాణ ఎంపీ ఎన్నికలు
- రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకేసారి పోలింగ్
- ఏప్రిల్ 18న ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్
- 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- మే 13న ఎంపీ స్థానాలకు ఎన్నికలు
- జూన్ 4న ఎన్నికల కౌంటింగ్
- నేటి నుంచి అమలులోకి రానున్న ఎన్నికల కోడ్
- జహీరాబాద్ ఎంపీ పరిధిలోకి కామారెడ్డి జిల్లా
- లోక్‌సభ పరిధిలో 16.33లక్షల ఓటర్లు
- ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు

కామారెడ్డి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా ఎదురు చూస్తున్న సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం షెడ్యూల్‌ను విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలను 7 విడతల్లో నిర్వహించనుంది. నాలుగో విడతలో రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఎన్నికలు జరుగనున్నాయి. మే 13న రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలకు పోలింగ్ జరుగగా జూన్ 4న ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించిన శనివారం నుంచే ఎన్నికల కోడ్ సైతం అమలులోకి రానుంది. ఎన్నికల నోటిఫికేషన్ మొదలుకొని ఫలితాల వరకు ఎంపీగా పోటీచేసే అభ్యర్థులు నెలన్నర రోజుల పాటు ఆగాల్సిందే. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి కామారెడ్డి జిల్లా రానుంది. ఈ లోక్‌సభ పరిధిలో మొత్తం 16,33,075 ఓటర్లు ఉన్నారు. అయితే ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు తమతమ అభ్యర్థులను ప్రకటించడం విశేషం.

తొలి విడతలోనే జహీరాబాద్ ఎంపీ ఎన్నికలు

కేంద్ర ఎన్నికల కమిషన్ ఎట్టకేలకు దేశవ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. దేశవ్యాప్తంగా నిర్వహించే లోక్‌సభ ఎన్నికలను 7 విడతల్లో జరుగనున్నాయి. నాలుగో విడతలోనే తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు లోక్‌సభ ఎన్నికలను నిర్వహించనుంది. ఎంపీ ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ కానుంది. మొదటి విడత ఎన్నికలు ఏప్రిల్ 19వ తేదిన, రెండవ విడత పోలింగ్ 26న, మూడవ విడత మే 7న, 4వ విడత మే 13న, 5 విడత పోలింగ్ మే 20న, 6వ విడత పోలింగ్ మే 25న, 7వ విడత పోలింగ్ జూన్ 1న నిర్వహించనుంది. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన లోక్‌సభ ఎన్నికలు నాలుగో విడతలో జరుగనుంది. ఈ నేపథ్యంలో జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి కామారెడ్డి జిల్లా రానుంది. ఈ జహీరాబాద్ ఎంపీ స్థానానికి మే 13న పోలింగ్ జరుగనుంది. జహీరాబాద్ ఎంపీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18వ తేదీన సంగారెడ్డి జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. ఆ రోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది.

జూన్ 4న ఎన్నికల ఫలితాలు

లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. తెలంగాణ లోక్‌సభ ఎన్నికలు నాలుగో విడతలోనే జరుగనున్నాయి. జూన్ 4న దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ స్థానాల ఫలితాలు వెల్లడి కానున్నాయి. అనగా లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ సుమారు రెండున్నర నెలల పాటు కొనసాగనుంది. రాష్ట్రంలో ఎంపీ స్థానానికి పోటీచేసే అభ్యర్థులు పోలింగ్ నుంచి మొదలుకొని ఎన్నికల ఫలితాల వరకు సుమారు రెండు నెలల పాటు వేచి చూడాల్సిందే. పోలింగ్ అనంతరం బరిలో ఉండే అభ్యర్థులు ఫలితాల వరకు ఉత్కంఠతో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. గెలుపోటములపై ఆశలు పెట్టుకొన్న అభ్యర్థులు రెండు నెలల పాటు టెన్షన్‌తోనే ఉంటారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

జహీరాబాద్ ఎంపీ పరిధిలోకి కామారెడ్డి జిల్లా

జహీరాబాద్ ఎంపీ స్థానం పరిధిలోకి కామారెడ్డి జిల్లా ఉండనుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోకి 7 అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణ్‌ఖేడ్, మూడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలు రానున్నాయి. మెజార్టీ అసెంబ్లీ నియోజకవర్గాలు జహీరాబాద్ ఎంపీ పరిధిలోకి కామారెడ్డి జిల్లా నుంచే ఉన్నప్పటికీ ఎంపీ స్థానం కేంద్రం సంగారెడ్డి జిల్లాకే రానుంది. అనగా జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆర్వోగా ఉంటారు. జహీరాబాద్ ఎంపీ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను మొదలుకొని ఫలితాల వరకు సంగారెడ్డి కలెక్టర్ పరిధిలోకి వెళ్లనున్నాయి. కానీ ఎన్నికల బందో బస్తు మాత్రం ఏ జిల్లా ఆ జిల్లా ఎస్పీల పరిధిలోకే రానున్నాయి.

ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థుల ఖరారు

జహీరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరనేది ఎన్నికల షెడ్యూల్ కంటే ముందే ఖరారయ్యారు. షెడ్యూల్ సైతం వచ్చేసింది. ఇక ఈ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల పోరు వేడెక్కనుంది. అభ్యర్థులు పార్టీలు మారినప్పటికీ ఈ లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆయా ప్రధాన పార్టీలు పాత కాపులనే బరిలో దింపడం విశేషం. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఇక ప్రచారంపై దృష్టి సారించనున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తరఫున మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ ఎస్ పార్టీ నుంచి గాలి అనిల్ కుమార్ బరిలో ఉండను న్నారు. బీఆర్‌ఎస్ ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఇటీవల బీజేపీలో చేరి అదేస్థానం నుంచి టికెట్ తెచ్చుకున్నారు. ఇక బీఆర్‌ఎస్ నుంచి జహీరాబాద్ లోక్‌సభలో కొత్తగా గాలి అనిల్‌కుమార్ పోటీ చేయనున్నారు. జహీరాబాద్ ఎంపీ స్థానంలో త్రిముఖ పోటీ నెలకొననుంది. ఈ ముగ్గురు అభ్యర్థుల మధ్యనే పోటీ ఉండనుంది.

లోక్‌సభ పరిధిలో 16,33,075 ఓట్లు

జహీరాబాద్ లోక్‌సభ పరిధిలోకి కామారెడ్డి జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్, ఆందోల్, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,33,075 ఓట్లు ఉన్నాయి. ఇందులో పురుషులవి 7,97,700లు ఓట్లు ఉండగా, మహిళలవి 8,33,951, థర్డ్ జండర్‌వి 63 ఓట్లు ఉన్నాయి. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,54,444 ఓట్లు ఉండగా పురుషులవి 1,22,264, మహిళలవి 1,32,014 ఓట్లు, థర్డ్ జండర్‌వి 20 ఓట్లు, ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,22,698 ఓట్లు ఉండగా పురుషులవి 1,06,387, మహిళలవి 1,15,355 ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,02,079 ఓట్లు ఉండగా పురుషులవి 99,118, మహిళలవి 1,02,814 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 1,95,694 ఓట్లు ఉండగా పురుషులవి 93,266, మహిళలవి 1,02,415 ఓట్లు, థర్డ్ జండర్‌వి 13 ఓట్లు ఉన్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,73,071 ఓట్లు ఉండగా పురుషులవి 1,36,574, మహిళలవి 1,36,391 ఓట్లు, థర్డ్ జండర్‌వి 2 ఓట్లు, ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,49,451 ఓట్లు ఉండగా పురుషులవి 1,22,031, మహిళలవి 1,27,364 ఓట్లు, థర్డ్ జండర్‌వి 8 ఓట్లు, నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,35,678 ఓట్లు ఉండగా పురుషులవి 1,18,064, మహిళలవి 1,17,498 ఓట్లు, థర్డ్ జండర్‌వి 9 ఓట్లు ఉన్నాయి.



ఎమ్మెల్సీ కవిత అరెస్టు కక్ష సాధింపు చర్యే

మాజీ ఎమ్మెల్యేలు గంప గోవర్ధన్, హన్మంత్‌షిండే

కామారెడ్డి టౌన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్యేనని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో కావాలనే ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయించేలా చర్యలు తీసుకుందన్నారు. కోర్టులో విచారణ కొనసాగుతుండగానే ఈ రకమైన చర్యలకు పూనుకోవడం కక్ష సాధింపు చర్యేనని అన్నారు. కవితను బేషరతుగా విడిచిపెట్టాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును ప్రజలు గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజిబోద్దీన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నిట్టు వేణుగోపాల్‌రావు, జడ్పీవైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావు, అధికార ప్రతినిధి గైని శ్రీనివాస్‌గౌడ్, భానుప్రసాద్ పాల్గొన్నారు.


కామారెడ్డిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బిచ్కుంద: ఎంపీ ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఎమ్మెల్సీ కవితను కక్షపూరితంగానే అరెస్టు చేయించిందని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను బీఆర్‌ఎస్ కార్యక ర్తలతో కలిసి ఆయన దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీఆర్‌ఎస్‌పై ప్రజల్లో తప్పుడు సంకేతాన్ని ఇచ్చేందుకు కవితను అరెస్టు చేసి ఢిల్లీకి తరలించి నీచ రాజకీయానికి పాల్పడిందని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని అసత్య ప్రచారాలు చేసినా తెలంగాణలో అధిక సంఖ్యలో ఎంపీ సీట్లు బీఆర్‌ఎస్ పార్టీ గెలు స్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- రేపటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు
- పరీక్షల నిర్వహణకు జిల్లాలో మొత్తం 62 సెంటర్లు
- హాజరుకానున్న 11,962 మంది విద్యార్థులు

కామారెడ్డి టౌన్, మార్చి 16: జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షలకు జిల్లా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ పరీక్షలు ఈనెల 18వ తేది నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 11,962 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకోసం 62 సెంటర్‌లను ఏర్పాటు చేశారు. ఈనెల 18న ఫస్ట్ లాంగ్వేజ్, 19న సెకండ్ లాంగ్వేజ్, 21న ఇంగ్లీషు, 23న గణితం, 26న ఫిజికల్ సైన్స్, 28న బయోలజికల్ సైన్స్, 30న సోషల్ స్టడీస్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని విద్యాశాఖధికారులు తెలిపారు.

ఉదయం 9.30 వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి

ఉదయం 9.30 నిమిషాల నుంచి 12.30 నిమిషాల వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్ష కేంద్రానికి హాజరయ్యే విద్యార్థి హాల్ టికెట్, రైటింగ్ ప్యాడ్, పెన్నులు, పెన్సిల్ వంటి రాత సామగ్రి తప్ప మిగిలిన ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, ప్రింటెడ్ పుస్తకాలు ఎట్లాంటివి అనుమతించబడవని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు పరీక్ష సమయంలో పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లకూడదు. సమాధాన పత్రం పూర్తిగా నింపినప్పటికీ కేటాయించబడిన పూర్తి పరీక్ష సమయం ముగిసే వరకు హాల్ నుంచి బయటకు అనుమతించబడదు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్లలో ఏ పొరపాట్లు ఉన్నా ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం కల్పించబడింది. అందుకుగాను విద్యార్థులు వారి హాల్ టికెట్‌ను బస్సు కండెక్టర్‌కు చూపిస్తే సరిపోతుంది. ఎండలు మండే అవకాశమున్నందున పరీక్ష కేంద్రాల వద్ద ఏఎన్‌ఎంను నియమించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లతో పాటు మందులు అందుబాటులో ఉంచనున్నారు.

విద్యార్థులే కాకుండా సిబ్బంది సూచనలు పాటించాలి

పరీక్షలకు హైదరాబాద్ నుంచి స్టేట్ అబ్జర్వరుతో పాటు ఇన్విజిలేషన్ చేసే సిబ్బంది, చీఫ్ సూపరింటెండెంట్‌లు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందం పరీక్షల విధుల్లో పాల్గొననున్నారు. అయితే విద్యార్థులతో పాటు వారు పలు సూచనలు పాటించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.పరీక్ష కేంద్రానికి కేటాయించబడిన సిబ్బంది అందరూ గుర్తింపు కార్డును ధరించాలి. సిబ్బంది తప్ప ఇతరులకు ప్రవేశం లేదు. పరీక్ష పర్యవేక్షణ అధికారి అనుమతి లేనిదే ఎవరికి పరీక్ష హాల్‌లోకి ప్రవేశం ఉండదు. పరీక్ష కేంద్రంలోకి చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, ఇన్విజిలేటర్, మెడికల్ సిబ్బంది, అటెండర్, వాటర్ బాయ్స్, అభ్యర్థులు, ఇతర పరీక్ష నిర్వహణ సిబ్బంది ఎవరూ కూడా సెల్‌ఫోన్, పేజర్లు, క్యాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకుపోకూడదు. ఒకవేళ అలా కనిపించినచో మాల్ ప్రాక్టీస్ కింద కేసు నమోదు చేయనున్నారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో అత్యవసర సమాచారంలో పోలీసు సిబ్బంది ఫోన్ మాత్రమే వినియోగిస్తూ ఇన్‌కమింగ్ అవుట్ గోయింగ్ కాల్స్ రిజిస్టర్‌లో రాయాలి. పరీక్ష కేంద్రం చుట్టు పక్కల 100 మీటర్ల వరకు 144 సెక్షన్ విధించనున్నారు. అంతేకాకుండా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జిరాక్సు సెంటర్లను మూసి ఉంచాలి.

పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం : డీఈవో రాజు

జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎక్కడా ఏ చిన్న అవంతరాలు జరగకుండా పకడ్బందీగా పరీక్షలను నిర్వహించనున్నాం. ఇందుకోసం 62 సెంటర్లను ఏర్పాటు చేశాం. విద్యార్థులు ముందురోజే తమ పరీక్ష కేంద్రాన్ని సందర్శిస్తే సులువుగా ఉంటుంది. విద్యార్థులు పరీక్షలకు సంబంధించిన సామగ్రి తప్ప ఏ ఇతర సామగ్రి వెంట తీసుకురాకూడదు.

ఎన్నికల విధులను నిజాయితీగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, మార్చి 16: పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు తమ ఎన్నికల విధులను నిజాయితీగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శనివారం నోడల్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల వ్యయ వివరాల నమోదు, ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ప్రతీ ఒక్కరికి సమానమైన హక్కు కల్పిస్తూ పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల పరిశీలక బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున ప్రజాప్రాతినిధ్యం చట్టంలోని సెక్షన్ 28 ప్రకారం మనమంతా భారత ఎన్నికల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎలాంటి రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో అధికారులు, సిబ్బంది పాల్గొనకూడదని స్పష్టం చేశారు. గోడలపై ఉన్న రాజకీయ పార్టీల వాల్‌పోస్టర్‌లు, కటౌట్లు తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోలు, క్యాలెండర్లు తక్షణమే తొలగించాలని తెలిపారు. రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు కప్పి ఉంచాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల సమయంలో జరుగుతున్న ఉల్లంఘనలను, నగదు, మద్యం పంపిణీని గుర్తించడం, రిపోర్టు చేయడం ఆధారాలు సేకరించడం, రికార్డు చేయడం చాలా కీలకమని, సీ-విజిల్ యాప్, 1950లో టోల్‌ఫ్రీ నెంబర్, ఇతర మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని బట్టి ఎన్నికల సమయంలో అక్రమ డబ్బు, నగదు సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ అధికారులు రాజారాం, బావయ్య, మురళీకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్, రఘునాథ్, ఏవో మసూర్ అహ్మద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
ఇఫ్తార్	సహర్
సా.6.32	ఉ.5.00



నిందించి, హేళనచేసి, చాడీలు చెప్పే ప్రతీవాడికి వినాశం తప్పదు

ఆర్‌వోబీ నిధుల మళ్లింపుపై ఆగ్రహం

మాక్లూర్, మార్చి 16: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మంత్రిగా పని చేసిన వేముల ప్రశాంత్‌రెడ్డి రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిధులను మళ్లించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మామిడిపల్లిలో బీజేపీ నాయకులు రాస్తారోకో చేసి ప్రశాంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

ముప్కాల్, మార్చి 16: ఈనెల 18నుంచి 30వరకు జరిగే ఉమ్మడి బాల్కొండ మండలంలోని పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని, ఎనిమిది పరీక్ష కేంద్రాల ఏర్పాటు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని మండల విద్యాధికారి తెలిపారు. ఉమ్మడి బాల్కొండలోని 25పాఠశాలల నుంచి 1098మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన పేర్కొన్నారు.


కమ్మర్‌పల్లి: ఈనెల 18న సోమవారం నుంచి ప్రారంభమవుతున్న పదవ తరగత పరీక్షల నిర్వహణ నిమిత్తం సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో ఎన్ ఆంద్రయ్య తెలిపారు. మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాలలో విద్యార్థుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

నందిపేట, మార్చి 16: మండలం ఐయిలాపూర్ గ్రామానికి చెందిన సుర కత్తుల హరీష్(22) జాలరి కోరుకుంట్ల చెరువులో చేపల వేటకు వెళ్లి వల చుట్టుకొని మృతి చెందినట్టు ఎస్సై జి.రాహుల్ తెలిపారు. ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లిన హరీష్ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పలు ప్ర దేశాలలో వెతికారు. కోరుకుంట్ల చెరువు వద్ద టీషర్టు, చెప్పులు కనిపించడం తో శనివారం గజఈతగాళ్లతో వెతికించగా మృతదేహాన్ని గుర్తించారు. బాబా యి పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

● చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి..

ఆర్మూర్ టౌన్: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో గుర్తుతెలియని వ్యక్తి(65) శనివారం చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని మోర్‌సూపర్ మార్కెట్ వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్ లో సమాచారం ఇవ్వాలని, నిజామాబాద్ మార్చురిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.







వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..

● పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన
● తీవ్రంగా కృషి చేస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు


పరీక్షలకు సన్నద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

ఇందల్వాయి, మార్చి 16 : ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి తమ పాఠశాలలో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులూ తీవ్రంగా కృషి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులను బోధిస్తూ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించేలా తర్ఫీదునిస్తున్నారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల ప్రకారం.. అక్టోబర్ నెల నుంచి ఉదయం, సాయంత్ర ం వేళల్లో గంట పాటు ప్రత్యేక తరగతులను నిర్వహించి పరీక్షలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి స్పెషల్ క్లాసులను బోధిస్తున్నారు. పరీక్షల్లో పట్టు సాధించేందుకు విద్యార్థులకు ఉపాధ్యాయులు తోడ్పడుతున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన అందిస్తూ ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. గతసంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు రావడం గమన్నార్హం. రెండు రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండగా గత రెండు నెలల నుంచి విద్యార్థులను అన్ని విధాలుగా పరీక్షలో మంచి మార్కులు సాధించేందుకు సిద్ధం చేశామని ఉపాధ్యాయులు తెలిపారు. పరీక్షల్లో పట్టు సాధించేందుకు సబ్జెక్టుల వారీగా విద్యాబోధన అందించి ఏడు రోజుల పాటు ప్రిపరేటరీ పరీక్షలు మరో ఏడు రోజుల పాటు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించి ఒక్కో సబ్జెక్టుపై విద్యార్థికి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. ప్రీఫైనల్ పరీక్షల ద్వారా విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వారి సామర్థ్యాలను సమీక్షించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. చదువుల్లో ముందున్న విద్యార్థులకు 10 జీపీఏ సాధించే విధంగా ప్రత్యేక తరగతుల ద్వారా విద్యాబోధన అం దించాలని వెనుకబడి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా వారిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. ప్రీఫైనల్, ప్రిపరేటరీ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో పరీక్షలంటే భయం తొలగిపోయిందని దీంతో వార్షిక పరీక్షలకు బాగా సన్నద్ధమయ్యేలా ఈ తరగతులు తోడ్పడ్డాయని అన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారం అందించడం అభినందనీయమని తెలిపారు. దీని ద్వారా పాఠశాలల్లోని ఒక్కో విద్యార్థికి సుమారు 10 గంటల సమయం చదువుకు కేటాయించినట్లు తెలిపారు. డిసెంబర్‌కల్లా సిలబస్ పూర్తి చేసి అప్పటి నుంచే పరీక్షలు రాసేందుకు విద్యార్థులను తీర్చిదిద్దామని తెలిపారు.

● ఇందల్వాయి మండలంలోని పాఠశాలల వారీగా పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలు

- జ్ఞానవాగ్దేవి విద్యాలయం, ఇందల్వాయి........ 46 మంది
- కేజీబీవీ, ఇందల్వాయి........ 38 మంది
- టీడబ్ల్యూఆర్ఈఐఎస్, గర్ల్స్ ఇందల్వాయి........ 94 మంది
- జడ్పీహెచ్ఎస్, అన్సాన్‌పల్లి........ 15 మంది
- జడ్పీహెచ్ఎస్, గన్నారం........ 80 మంది
- జడ్పీహెచ్ఎస్, నల్లవెల్లి........ 69 మంది
- జడ్పీహెచ్ఎస్, సిర్నాపల్లి........ 12 మంది
- జడ్పీహెచ్ఎస్, ఎల్లారెడ్డిపల్లి........ 67 మంది
- జడ్పీహెచ్ఎస్, ఇందల్వాయి........ 57 మంది
- జడ్పీహెచ్ఎస్, సిర్నాపల్లి ఉర్దూమీడియం........ 7 మంది

● సెంటర్ల వారీగా విద్యార్థులు ఇలా..

- జడ్పీహెచ్ఎస్, గన్నారం........ 220
- జడ్పీహెచ్ఎస్, సిర్నాపల్లి........ 88
- జడ్పీహెచ్ఎస్, ఇందల్వాయి........ 95
- జడ్పీహెచ్ఎస్, ఎల్లారెడ్డిపల్లి..... 82

'పది' పరీక్షలకు పూర్తయిన ఏర్పాట్లు



ఈనెల 18వ తేదీ నుంచి పదవ తరగతి పరీక్షలు జరుగనుండగా.. అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఇందల్వాయి ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు. అన్ని సెంటర్లలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించామని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని సొం తంగా పరీక్షలు రాయాలని ఎలాంటి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాపీయింగ్‌కు పాల్పడి భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు.

- శ్రీనివాస్‌రెడ్డి (ఎంఈవో, ఇందల్వాయి)

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు



పదవ తరగతి వార్షిక పరీక్షలు రాసేందుకు విద్యార్థులను అన్ని రకాలుగా సిద్ధం చేశామని గన్నారం గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కంఠం భార్గవ్ అన్నారు. ఈసారి ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించి.. ఎక్కువ మంది విద్యార్థులకు 10 జీపీఏ సాధించే విధంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు డిసెంబర్‌లోనే సిలబస్ పూర్తిచేసి ప్రత్యేక తరగతులను నిర్వహించి విద్యార్థులను బాగా చదివించామన్నారు. తప్పకుండా ఈసారి విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారన్నారు.

కే. భార్గవ్ (ఉపాధ్యాయుడు, గన్నారం)

తల్వేద బ్రిడ్జిపై బారికేడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ


తల్వేద బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నవీపేట,మార్చి16: మండలంలోని నాళేశ్వర్, నందిపేట మండలం తల్వేద మధ్యనున్న వాగుపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయిస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని నాళేశ్వర్‌లో జరిగిన ఓ వివాహవేడుకలో పాల్గొని నందిపేట మండలానికి వెళ్తూ మార్గమధ్యలో తల్వేద బ్రిడ్జిని పరిశీలించారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు తల్వేద బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు దెబ్బతిన్నదని బ్రిడ్జికి ఇరువైపులా భారీకేడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని పలువురు నాళేశ్వర్ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బ్రిడ్జికి మరమ్మతు పనులు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాళేశ్వర్ మాజీ సర్పంచ్ సరిన్, గంగాధర్, చిన్న భీంరెడ్డి, గణేష్, భూషణ్, తదితరులున్నారు.

●ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మాక్లూర్:రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తున్న ప్రభుత్వం, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని మాక్లూర్ గ్రామంలో కల్యాణ లక్ష్మీ,షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావుతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధి కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ఎడపల్లి,మార్చి 16:గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ విద్యావ్యవస్థ పటిష్టం చెందాలంటే ప్రతీ ఒక్కరు తన వంతు బాధ్యతగా కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఎడపల్లి మండలంలోని ఏఆర్పీ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన గణిత ప్రయోగశాలను ఆయన ప్రారంభించి ప్రయోగశాల వివరాలను ఉపాధ్యాయులకు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణిత ప్రయోగశాల ఏర్పాటుకు పాఠశాల పూర్వ విద్యార్థి అయిన ఎన్నారై ఎడమకంటి కృష్ణారెడ్డి సహకారంతో గణితశాస్త్ర ప్రయోగశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో అన్ని మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. గ్రామస్థులు పాఠశాల అభివృద్ధిలో పాలుపంచుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం, అదనపు గదుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదని, గ్రామాల్లోని ప్రజలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మౌలిక సదుపాయాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజితా యాదవ్, ఎన్నారై కృష్ణారెడ్డి తల్లిదండ్రులు తిరుపతమ్మ, వెంకట్ రెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎంలు రమేష్, టీచర్లు, పార్టీ నాయకులు లింగం, బలరాం, ఒడ్డెన్న, ఎల్లయ్య యాదవ్, బంజ కామప్ప, నవీన్, మహేష్ గౌడ్, అలేఖ్య, బొబ్బిలి శ్రీనివాస్, విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో మిట్టపల్లి విద్యార్థికి బంగారు పతకం

డిచ్‌పల్లి, మార్చి 16: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని అమూల్య బంగారం పతకం సాధించిందని ప్రధానోపాధ్యాయుడు సుశీల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమూల్యను ఉపాధ్యాయ బృందం సన్మానించారు. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అమూల్య పాల్గొని పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారం పతకం అందుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శోభన్ బాబు, వ్యాయమ ఉపాధ్యాయుడు గంగామోహన్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు

మోర్తాడ్, మార్చి16: మండల కేంద్రంలోని ప్రజా భవన్‌లో శనివారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన అగ్రనాయకులు బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. దొన్కల్‌కు చెందిన మాజీసర్పంచ్, తెలంగాణ సీడ్ సర్టిఫికేషన్ ఆర్గనిక్ డైరెక్టర్, మోర్తాడ్ మాజీఎంపీపీ కల్లెడ చిన్నయ్య మాజీఎంపీపీ ఉపాధ్యక్షుడు సింగిరేడ్డి రాజేశ్వర్, సుంకెట్ మాజీసర్పంచ్ నర్సింహరెడ్డి, మోర్తాడ్‌కు చెందిన శివకుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా వేసి సునీల్‌కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణలో ప్రజాపాలన ప్రజల ఆమోదంతో సమర్థవంతంగా సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలన చేస్తున్నారని, నియోజకవర్గంలో సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు పెరుగుతున్నాయని పార్టీలో చేరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల సునీల్‌కుమార్, సుంకెట రవి, గిర్మాజీ గంగాధర్, గడ్డం అనిల్, మహిపాల్, పుప్పాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ రంగంలో ప్రతిభకు ప్రతిష్ఠాత్మక అవార్డు


ప్రతిష్ఠాత్మక ఎండీఆర్‌టీ అవార్డును అందుకుంటున్న దృశ్యం

బోధన్ రూరల్, మార్చి 16: ఇన్సూరెన్స్ రంగంలో ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబ రిచిన బోధన్ ఎల్ఐసీ గంగారెడ్డికి ప్రతిష్ఠాత్మక ఎం.డి.ఆర్.టి. అవార్డును అందజేశారు. శనివారం హైదరాబాద్‌లోని మారియట్ హోటల్‌లో ఎల్ఐసీ జోనల్ మేనేజర్‌లు, డివిజనల్ మేనేజర్లకు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులతో సత్కరించారు. ప్రజలు పాలసీలు కట్టి ఎల్ఐసీలు అందించే సౌకర్యాలను, భీమాలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎల్ఐసీ గంగారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

● బోధన్ కోర్టులో 818 కేసులు పరిష్కారం


బోధన్ కోర్టులో లోక్ అదాలత్ దృశ్యం

బోధన్‌రూరల్, మార్చి 16:రాజీమా ర్గమే రాజ మార్గమని ఐదవ అదనపు జిల్లా న్యాయాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. శనివారం బోధన్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయస్థానంలో నాలుగు బెంచీలను ఏర్పాటు చేసి 818 కేసులను పరిష్కరించబడ్డాయని వివరించారు. ప్రజలు కోర్టుల చుట్టూ తిరగకుండా రాజీ మార్గంతోనే కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ న్యాయాధికారి అజయ్‌కుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి పూజిత, అదనపు శ్రేణి న్యాయాధికారి సాయి శివలతో న్యాయవాదులు డాక్టర్ మధుసింగ్, మారుతిరావు ఖన్నా, కళ్యాణిలతో న్యాయ సేవాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బోధన్ రూరల్, మార్చి 16 : బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో వివాహిత వైష్ణవి (20) అనే మహిళా ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగ్‌నాథ్ తెలిపారు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు జరుపుతున్నామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు.

అకాల వర్షంతో రైతుకు అపార నష్టం

● జిల్లాలో ఈదురు గాలులు, పిడుగులతో కురిసిన వర్షం ● పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం

నిజామాబాద్ అర్బన్, మార్చి 16: నగరంలో భారీ వర్షం కురిసింది. శనివారం సాయంత్రం ఒక్కసారిగా ఈదురు గాలులు, పిడుగులతో కురిసిన వర్షానికి నగరంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వేసవి కాలం ప్రారంభం కావడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న నగర ప్రజలు శనివారం కురిసిన వర్షానికి కొంత ఉపశమనం పొందారు. పూర్తిస్థాయిలో వర్షం కురవకపోవడంతో ఉక్కపోతకు గురయ్యారు. నగరంలోని ప్రధాన రోడ్లన్నీ వర్షం నీటితో నిండిపోయాయి. కొంత మంది వర్షంలో తడుస్తూ ఉపశమనం పొందారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కురిసిన అకాల వర్షానికి తీవ్ర పంటనష్టం జరిగింది. ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, మోస్రా, తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో చేతికొచ్చిన పంట నేలరాలింది. వరి పొట్టకు వస్తున్న ప్రస్తుత తరుణంలో వడగండ్ల వాన కురవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్నిచోట్ల పంటలు ఎండిపోతున్న సమయంలో వర్షం పంటలను కాపాడిన నష్టమే ఎక్కువ జరిగిందని రైతులు వాపోతున్నారు.

డిచ్‌పల్లి:మండలంలో ఖిల్లా డిచ్‌పల్లి, రాంపూర్, ఘన్‌పూర్, మిట్టపల్లి, ముల్లంగి, సుద్దులం, కోరట్‌పల్లి, యానంపల్లి, ధర్మారం(బి) గ్రామాల్లో కురిసిన ఆకాల వర్షానికి కోత దశలో ఉన్న వరి పైరు నెలకొరిగి వడ్లు రాలిపోయాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో నూర్పిడి చేసిన ధాన్యం వర్షం నీటిలో


డిచ్‌పల్లిలో వడగండ్ల వానతో నేలరాలిన ధాన్యం

తడిసిపోయింది. మరో రెండు రోజుల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం ఉంటుందని వాతావరణ శాఖ ప్రకటనలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోత దశకు వచ్చిన వరి పైరు నేల కొరగడంతో దిగుబడి తగ్గుతుందని రైతులు లబోదిబోమంటున్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వేసవి ఉక్కపోతతో ప్రజలు సతమతం అవుతున్న వేళ శనివారం కురిసిన భారీ వర్షంతో ఉపశమనం లభించినట్లయింది. పంటలు ఎండిపోతున్న తరుణంలో కూడా భారీ వర్షం రైతుల్లో ఆశలు నింపుతోంది. చేతికొచ్చిన పంట చివరి నిమిషంలో అకాల వర్షం కురియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ధర్పల్లి:మండలంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో రైతులు అతలా కుతలం అయ్యారు. రామడుగు, నడిమితండాలో రాళ్ల వర్షం కురిసింది. దీంతో వడ్ల గింజలు నేలపాలు అయ్యాయి. చేతికొచ్చిన పంట అకాల వర్షం, రాళ్ల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఆరు గాలం శ్రమించి కోత దశలో ఉండటంతో అకాల వర్షంతో ఘోరంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూ గర్భ జలాలు అడుగంటి పంటలను ఎండిపోయి వదిలేసుకున్న సమయంలో ఉన్న కొద్దిమేర పంట అకాల వర్షంతో వడ్ల గింజలు నేలపాలు కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బోధన్‌రూరల్: శనివారం సాయంత్రం బోధన్ పట్టణంలో ఒక్కసారిగా ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. ఈదురు గాలులకు పలు చోట్ల రోడ్లపై చెట్లు పడ్డాయి. గంట సేపు భారీ వర్షం కురిసింది

ఇందల్వాయి:మండలంలో కురిసిన అకాల వర్షం వల్ల రైతుకు తీవ్ర నష్టం వాటిల్లింది. శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వడగండ్ల వర్షం కురవడంతో చేతికొచ్చిన వరిపంట నేలరాలింది. పంట చేతికొచ్చిన దశలో వడగండ్ల వర్షం రావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. సుమారు పది నిమిషాల పాటు వడగండ్ల వర్షం కురిసిందని రైతులు తెలిపారు.

సిమెంట్ రోడ్ల పనుల ప్రారంభం

సిరికొండ, మార్చి 16:మండలంలోని నాలుగు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం పనులను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. పెద్దవాల్గోట్, ధర్పల్లి తండా, రామడుగు, రావుట్ల గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి, జిల్లా కార్యదర్శి ఎర్రన్న, బీసీసెల్ అధ్యక్షుడు నర్సింగ్, తదితరులు గ్రామాల్లో రోడ్ల పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి నిధులు మంజూరు చేసినందున ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

18న మనోహరాబాద్‌లో ఇసుక బహిరంగ వేలం పాట

జక్రాన్‌పల్లి, మార్చి16: మండలంలోని మనోహరాబాద్ గ్రామంలో ఈనెల 18న అక్రమ ఇసుక డంప్‌కు బహిరంగ వేలం వేస్తున్నట్లు తహసీల్దార్ కిరణ్మాయి తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు మనోహరాబాద్‌లో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగే అక్రమ ఇసుక డంప్ బహిరంగ వేలం పాటలో పాల్గొనే వారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. రెండు రోజుల క్రితం మనోహరాబాద్ గ్రామంలో మైన్స్ పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి అక్రమ ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు విధితమే. ఈ మేరకు సోమవారం అక్రమ ఇసుక డంప్‌ను వేలం వేస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

తల్లిదండ్రులు టీచర్ల పట్ల గౌరవం ఉండాలి

ఏర్గట్ల, మార్చి 16: విద్యార్థులు తల్లిదండ్రులు విద్యను నేర్పే ఉపాధ్యాయుల పట్ల గౌరవంగా ఉండాలని ఏర్గట్ల హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృష్ణచారి అన్నారు. శనివారం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఇన్‌పాక్ట్ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు చదువుపై, శ్రద్ధ పెద్దల పట్ల గౌరవం వంటి అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మునీరోద్దీన్, కుదైజా, శ్రీనివాస్, కేజీబీవి ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా బీఆర్ఎస్ నాయకుల ఆందోళనలు

బాన్సువాడ టౌన్, మార్చి 16: ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా శనివారం జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. బాన్సువాడ పట్టణంలో బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద రోడ్డుపై బైఠాయించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రం కవితను అక్రమంగా అరెస్టు చేయించడం భావ్యం కాదన్నారు. తక్షణమే తమ నాయకురాలు కవితను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్, బీఆర్ఎస్ నాయకులు దుద్దాల అంజిరెడ్డి, ఏర్వల కృష్ణారెడ్డి, ఎజాజ్, గోపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, దాసరి శ్రీనివాస్, ఉదయ్, కిరణ్, వెంకటేశ్, లింగమేశ్వర్, బుల్లెట్ రాజు, నారాయణరెడ్డి, హజారే శంకర్, కార్యకర్తలు తదితరులున్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పుడు పడుతూ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రఘు, మండల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు శశికాంత్, వైస్ ఎంపీపీ కాశీరాం, ఎంపీటీసీ సందీప్, కోఆప్షన్ ఆరీఫ్, నాయకులు దుంపల రాజు, రఘు, లాయక్, ఉప్పల పాటి సత్యనారాయణ, గంగారాం, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: పట్టణ కేంద్రంలోని తెలంగాణ తల్లి ప్రాంగణంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, మండల అధ్యక్షుడు జలందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్‌కుమార్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులు ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసిస్తూ రాస్తారోకో, ధర్నా నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్రమంగా అరెస్టు చేసిన ఎమ్మెల్సీ కవితను వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడుతుందని, కావాలనే ఈడీ కేసులను బనాయిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో ధర్నా నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



బీర్కూర్‌లో..



ఎల్లారెడ్డిలో..



వైన్‌షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వైన్‌షాపులో ఎక్సైజ్ అధికారుల తనిఖీ

బిచ్కుంద, మార్చి 16: మండల కేంద్రంలోని శివమల్లార్ వైన్‌షాప్‌లో విక్రయించే మద్యంలో కల్తీ ఉన్నట్లు ఫిర్యాదు రావడంతో బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి తనిఖీ చేపట్టారు. ఫిర్యాదు వచ్చిన లిక్కర్ బాటిల్ ఓపెన్ చేసి గ్లాసులో పోసి పరిశీలించగా కల్తీ లాంటివి లేదన్నారు. కొన్ని లిక్కర్ బాటిళ్లను పరీక్ష నిమిత్తం నిజామాబాద్ ఎక్సైజ్ ఫోరెన్సీ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. బిచ్కుంద సర్కిల్ పరిధిలోని మండలంలోని ఏ గ్రామంలోనైన దేశీదారు, గుడుంబా, గంజాయి, కల్తీ విక్రయాలు జరిగినట్లయితే వెంటనే సమాచారం అందించాలని ఎంతటి వారినైన ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేసుకోవాలి

నిజాంసాగర్, మార్చి 16: ప్రతీ రైతు తప్పనిసరిగా ఈ కేవైసీ నమోదు చేసుకోవాలని ఏఈవో స్వర్ణలత తెలిపారు. మండలంలోని అచ్చంపేట గ్రామంలోని రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి సమ్మాన్ నిధి 15వ విడత, 16వ విడత డబ్బులు ఈ కేవైసీ నమోదు చేసుకోకుంటే జమ కావన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో పర్యటించి వరి పంటలను పరిశీలించారు.

జగద్గురువును దర్శించుకున్న భక్తులు

మద్నూర్, మార్చి 16: జుక్కల్ మండలంలోని దోస్‌పల్లి, బంగారు పల్లి తెలంగాణ ఉప పీఠంతో స్వామి నరేంద్ర మహరాజ్ రావడంతో భక్తులు వచ్చి దర్శనం చేసుకున్నారు. భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషి ధర్మం పట్ల కట్టుదిట్టంగా ఉండి ధర్మాన్ని రక్షిస్తూ, భక్తి మార్గంలో నడుచుకోవాలన్నారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు.

ఎల్లారెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆజార్ ఖాద్రి

ఎల్లారెడ్డి, మార్చి 16: ఎల్లారెడ్డి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహ్మద్ ఆజాద్‌ఖాద్రి, సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా సురేష్ నాయక్, ఎల్లారెడ్డి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సంతోష్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కిరణ్, నియామకమైనట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్ చేతుల మీదుగా శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు.



ఎల్లారెడ్డిలో నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

బిల్లులు మంజూరు చేయాలి

ఎల్లారెడ్డి, మార్చి 16: మధ్యాహ్న భోజన బిల్లులు ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి ఇప్పటి వరకు నిధులు రాక అవస్థలు పడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోఫియా, సల్మాన్ బేగం సల్మా, సంగీత, సాయిలు, అంబవ్వ తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో తేలికపాటి జల్లులతో కూడిన వర్షం

బాన్సువాడ టౌన్, మార్చి 16: బాన్సువాడ పట్టణంలో శనివారం ఉదయం తేలికపాటి జల్లులతో కూడిన వర్షం కురిసింది. సుమారు 15 నిమిషాల పాటు వర్షం పడడంతో వాతావరణంలో మార్పు చోటు చేసుకున్నాయి. ఎండాకాలం ఉక్కపోతకు వర్షం ప్రజలకు కాసింత ఉపశమనం కలిగించింది.

నిజాంసాగర్‌లో తైబజార్ వేలం పాట

నిజాంసాగర్, మార్చి 16: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శనివారం తైబజార్ వేలంపాట నిర్వహించారు. ప్రత్యేకాధికారి, తహసీల్దార్ భిక్షపతి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించగా, రూ.2.24 లక్షలకు తైబజార్ వేలంలో పిట్లంకు చెందిన హన్మాండ్లు దక్కించుకున్నారు. ఒక సంవత్సరం పాటు తైబజార్ వసూలు చేసుకోవచ్చని తెలిపారు. గత సంవత్సరం రూ.2.13 లక్షలకు పలికిన వేలంపాట ఈ సంవత్సరం మరో 9వేలు అదనంగా పలికినట్లు జీపీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బలరాముడు, కారోబార్ సాయిలు తదితరులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి, మార్చి 16: పాల్వంచ మండలం ఫరీద్‌పేట్ గ్రామ శివారులోని లొట్టివాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఫరీద్‌పేట్ గ్రామ శివారులోని లొట్టివాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించి ఇసుక ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

లోక్‌అదాలత్‌లో పెద్దమొత్తంలో కేసుల పరిష్కారం

- చిన్నచిన్న వివాదాలకు కక్షలు పెంచుకోవద్దు
- జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీదేవి



కామారెడ్డి కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారులు



ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్

కామారెడ్డి టౌన్, మార్చి 16: జాతీయ లోక్‌అదాలత్‌లో మునుపెన్నడూ లేనివిధంగా పెద్దమొత్తంలో కేసులకు పరిష్కారం లభించిందని జిల్లా ప్రధానన్యాయాధికారి శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ కోర్టులలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు రాజీ పడ్డాయని తెలిపారు. ప్రీలిటిగేషన్ కేసులు అనగా రెగ్యులర్‌కోర్టుకు రాని కేసులు కూడా పరిష్కరించబడతాయని తెలిపారు. చట్టపరిజ్ఞానం ప్రజలందరికి తెలిసి ఉండాలన్నారు. పోలీసులు, న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించి రాజీకుదుర్చుటకు సహకరించారని వారిని అభినందిస్తున్నామని తెలిపారు. చిన్నచిన్న వివాదాలకు కక్షలు పెంచుకుని మానసికంగా ఇబ్బందులకు గురికావద్దని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ అధికారులు నాగరాణి, లాల్‌సింగ్ శ్రీనివాస్ నాయక్, సుధాకర్, పీపీలు రాజగోపాల్‌గౌడ్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో 775 కేసులు పరిష్కారం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 775 కేసులు పరిష్కారమైనట్లు న్యాయాధికారి హారిక తెలిపారు. పరిష్కారమైన కేసులలో క్రిమినల్ 83 కేసులకు వాటికి 62,990 రూపాయల జరిమానా, ఆబ్కారీ శాఖకు సంబంధించి 31 కేసులు పరిష్కారం కాగా వాటికి ఒక లక్షా యాభై అయిదు వేల జరిమానా విధించారు. భరణం కేసులు ఐదు, బ్యాంకులకు సంబంధించి నాలుగు కేసులకు 81,030 జరిమాన విధించారు. పీటి కేసులు 652 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పద్మ, పండరీ, సతీష్, సాయి, ప్రకాష్ దేశ్‌పాండే, గోపాల్‌రావు, సాయిబాబా, ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎక్సైజ్ సీఐ షాకీర్, అహ్మద్, ఎస్సై బొజ్జ మహేష్, కోర్టు సిబ్బంది రాజమోహన్ పాల్గొన్నారు.

భిక్కనూరులో వడగండ్ల వాన

- నేలకొరిగిన వరిపంట
- ఇంటిపై పడిన భారీ చెట్టు

భిక్కనూరు, మార్చి 16: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం రాత్రి భారీ వడగండ్ల వర్షం కురిసింది. ఈదురుగాలుతో మొదలైనా ఈ వడగండ్ల వర్షంతో రోడ్లపై వడగండ్లు నిండిపోయాయి. రోడ్లపై ఉన్న జనాలు ఈ వడగండ్లకు భయపడి పరుగులు తీశారు. పట్టణంతో పాటుగా ఆయాగ్రామాల్లో వరిపంట, మొక్కజొన్న నెలకొరిగింది. భిక్కనూరు గ్రామంలోన కుమ్మరిగల్లీ ప్రాంతంలో నివాసపు ఇంటిపై భారీచెట్టు పడింది. ఈ ప్రమాదంలో ఇల్లు పూర్తిగా దెబ్బతినగా పెద్దప్రమాదం తప్పింది. చెట్టుపడటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

- గోడకు తలబాదుకుని హల్‌చల్

భిక్కనూరు, మార్చి16: మద్యం మత్తులో ఓ యువకుడు భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో వీరంగం సృష్టించాడు. భిక్కనూరు శ్రీ సిద్ధరామేశ్వర ఆలయ కమాన్ సమీపంలో పోలీసులు శనివారం రాత్రి డంకెన్‌డ్రైవ్ చేపడుతుండగా కొందరు యువకులు వైన్స్ సమీపంలో డంకెన్‌డ్రైవ్ ఎలా నిర్వహిస్తారని పోలీసుసిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. దీంతో పోలీసులు వారిని పోలీసుస్టేషన్‌కు తరలించి విషయాన్ని ఎస్సైకు వివరించారు. అదేసమయంలో గ్రామానికి చెందిన ఓ యువకుడు పోలీసుస్టేషన్‌కు వచ్చి పోలీసుల చొక్కా పట్టుకుని బూతులు తిట్టాడూ హంగామా సృష్టించాడు. బీరువా, గోడకు తలతో బాదుకున్నాడు. ఆ యువకుడి తల్లిదండ్రులను పిలిపించి భిక్కనూరు ప్రాథమిక ఆసుపత్రిలో చికిత్స చేయించి అప్పగించారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాలి

దోమకొండ, మార్చి16: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలకు అందేలా అధికారులు కృషి చేయాలని జడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలసి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన గృహజ్యోతి వివరాల నమోదు కౌంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గృహజ్యోతి పథకం కొందరికి జీరో బిల్ రాకపోవడంతో ఏడీఈ కారణ్ చైతన్యతో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు సీతారాం మధు, రాములు, గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలి'

కామారెడ్డిటౌన్, మార్చి 16: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని విజ్ఞాన్ వికలాంగుల సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్ప దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు రూ.6వేల పెన్షన్ పెంపు, ఉచిత బస్సు ప్రయాణం, బ్యాక్‌లాగ్ ఉద్యోగాలు, ఉన్నత ఉద్యోగాల్లో రిజర్వేషన్‌లు, 2016 దివ్యాంగుల చట్టం అమలుచేయాలని అన్నారు. జీవో 3 రద్దు చేయడం ద్వారా మహిళా దివ్యాంగులకు రోస్టర్‌పాయింట్‌లు అసలే దక్కవని అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం అన్నిరకాల న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రంగ్యానాయక్, బంటు స్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పరిష్కారానికి తక్షణ చర్యలు: ఎమ్మెల్యే



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంత్‌రావు

మద్నూర్, మార్చి16: ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ, ఆర్‌అండ్ బీ అధికారులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంత్ రావు ఆదేశించారు. మద్నూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే సమావేశాలు నిర్వహించి, కళ్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం మద్నూర్ మార్కెట్ కమిటిలో విలేకరులతో మాట్లాడారు. జుక్కల్ నియోజకవర్గంలో 167 గ్రామాలకు తాగునీరు రావడం లేదని, ఇందుకు కారణం గత పాలకులు కమీషన్లు తీసుకుని ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారని ఆరోపించారు. ప్రజలకు తాగు నీటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిన్నశక్కర్గ, ఖరగ్ గ్రామాల్లో విజయోత్సవ సభల్లో పాల్గొన్నారు. పలువురు నాయకులు కాంగ్రెస్‌లోచేరడంతో వారికి కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశ పెడుతుందని గుర్తు చేశారు. కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ కింద ఉమ్మడి మద్నూర్ మండలంలో 28 మందికి చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని సూచించారు. కార్యక్రమంలో మద్నూర్ ఎఎంసీ మాజీ చైర్మన్ సంగమేశ్వర్, మద్నూర్ మండల ప్రత్యేకాధికారి బండి విజయ్, కాంగ్రెస్ నాయకులు సాయిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




ప్రమాదానికి గురైన ఆటో, ఘటనా స్థలం వద్ద పడి ఉన్న క్షతగ్రాతులు

ఆటో బోల్తా.. ఇద్దరి మృతి

- పది మందికి గాయాలు
- వివాహానికి వెళ్లివస్తుండగా ఘటన

లింగంపేట, మార్చి16: ఆటో బోల్తా పడి ఇద్దరు మృతిచెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బాయంపల్లి వద్ద శనివారం ఓ వివాహానికి వెళ్లివస్తుండగా చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంసాగర్ మండలంలోని సింగితం, వడ్డెపల్లి, గున్కుల్ గ్రామాలకు చెందిన 12 మంది బంధువులు లింగంపేట మండలంలోని కొర్పోల్‌లో జరిగే వివాహ వెళ్లి వస్తున్నారు. బాయంపల్లి వద్ద ప్రమాద వశాత్తు ఆటోబోల్తాపడడంతో నిజాంసాగర్ మండలం సింగితం గ్రామానికి చెందిన గౌడ గారి సంగయ్య (66) అక్కడికి అక్కడే మృతిచెందగా, లాలవ్వ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో లాలవ్వ (40) మృతి చెందినట్లు ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. ఆటోలో ప్రయాణిస్తున్న గన్కుల్, వడ్డెపల్లి గ్రామాలకు బంధువులు గాయపడ్డారు. గాయపడ్డవారిలో బాలమణి, సతీష్, సాయవ్వ, పోచవ్వ, కవిత, మరో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. క్షతగాత్రుల పిర్యాదు మేరకు కేసునమోదు చేసి విచారణ జరుపుతున్నామని ఎస్సై తెలిపారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



పరీక్షకేంద్రాలలో వేసిన హాల్ టికెట్ నెంబర్లను పరిశీలిస్తున్న దృశ్యం

నిజాంసాగర్, మార్చి 16 : పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చీఫ్ సూపరింటెండెంట్ అమర్‌సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయన్నారు. మండలంలో మొత్తం 3 పరీక్ష కేంద్రాలున్నాయని నిజాంసాగర్, అచ్చంపేట మోడల్ పాఠశాల, మహ్మద్ నగర్‌లలో ఏర్పాటు చేశామన్నారు. 442 మంది పరీక్షలు రాయనున్నారని, ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు పెన్నులు, ప్యాడ్, హాల్ టికెట్ మినహా ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు వెంట తీసుకుని రావద్దన్నారు. ఆయా కేంద్రాలకు సూపరిండెంట్‌లుగా అమర్‌సింగ్, హరిసింగ్, తిరుపతి రెడ్డిలతోపాటు డిపార్ట్‌మెంట్ అధికారులుగా మధుసూదన్, బాలచందర్, వెంకటేశంలను నియమించారు.

పరీక్షాకేంద్రాల్లో మాస్‌కాయింగ్ జరగకుండా చూడాలి

భిక్కనూరు, మార్చి 16: మండలంలోని పదవతరగతి పరిక్షా కేంద్రాలలో మాస్‌కాపియింగ్ జరగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు గందం సంజయ్ డిమాండ్ చేశారు. శనివారం మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ మాస్‌కాపియింగ్‌తో ప్రతిభకలిగిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వారికి అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. ప్రతీ పరీక్షాకేంద్రంలో విద్యార్థులకు సరైనా సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సమీర్‌ఖాన్, శివకృష్ణ, రాజేందర్, ఆదర్శ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఏర్పాటు

బీర్కూర్, మార్చి16: కాంగ్రెస్ పార్టీ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామాల్లో గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం బీర్కూర్ తండా, మల్లాపూర్ గ్రామాల్లో మండలస్థాయి నాయకులు సమావేశం నిర్వహించి కమిటీలను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ సమన్వయ కమిటీ కన్వీనర్ ఇందూరు చంద్రశేఖర్, మండల అధ్యక్షులు బోయిని శంకర్, సొసైటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కొత్తకాపు కాంత్‌రెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు బసవరాజు పటేల్, చందు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి ఇక్బాల్, తిమ్మాపూర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్లెక్సీలు తొలగింపు

ఎల్లారెడ్డి, మార్చి 16: లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో శనివారం సాయంత్రం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్లెక్సీలను, వాల్ పోస్టర్లను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమలులో ఉందని రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు.



ఎల్లారెడ్డిలో ప్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పేకాట స్థావరంపై దాడి : ఆరుగురి అరెస్టు

ఎల్లారెడ్డి, మార్చి 16: ఎల్లారెడ్డి పట్టణ శివారులోని కొందరు వ్యక్తులు మూడు ముక్కలాట ఆడుతున్నట్లు సమాచారం మేరకు ఎల్లారెడ్డి ఎస్ఐ బొజ్జ మహేష్ దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.5,940, ఐదు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిని పంచనామా అనంతరం పోలీసు స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయనతో పాటు ఎస్ఐ విజయ కానిస్టేబుల్ ప్రేమ్‌సింగ్, హోంగార్డు పెంటయ్య ఉన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎవరైనా పేకాట ఆడితే సమచారాం ఇవ్వాలని, చట్టం ప్రకారం చర్యలు తప్పవని అన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్	- రజాకార్
శాంతి	- ప్రేమలు
ప్రియా 70	- భీమా
ప్రియా 35	- తంత్ర

బాన్సువాడ

మహేశ్వరి	- భీమా
వెంకటేశ్వర	- రజాకార్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

